క్లుప్తంగా

ముగిసిన పద్యపోటీలు



వినుకొండ(నూజెండ్ల): మహాకవి, కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా జాషువా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రాష్ట్రస్థాయి రంగస్థలం, పౌరాణిక పద్యపోటీలు ముగిశాయి. పద్య పోటీల్లో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని మాట్లాడుతూ కుల వివక్ష, పేదరికాలను తన గురువులుగా భావించి చీత్కారాలు, అవమానాలు ఎదుర్కొన్న చోటే సన్మానాలు పొందడం అది ఒక్క మహాకవి గుర్రం జాషువా వలనే సాధ్యమైందన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి మన వినుకొండ వాసి అవడం నిజంగా మనం చేసుకున్న అదృష్టమన్నారు. ఈ పోటీల్లో ప్రథన బహుమతి నీలం వెంకటేశ్వర్లు (అచ్చంపేట), ద్వితీయ బహుమతి మురికిపూడి రత్నకుమార్ (గోపువారిపాలెం), తృతీయ బహుమతి లాలునాయక్ (చిలకలూరిపేట)లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు, జాషువా సాంస్కృతిక సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

30న మెగా ఉచిత కంటి వైద్యశిబిరం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఈనెల 30న గడిపూడి వెంకట్రాయుడు-బిక్షావతి ట్రస్టు సారథ్యంలో పెదకాకాని శంకర నేత్రవైద్యశాల వైద్యుల పర్యవేక్షణలో మేగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామవాసీ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టరు చెరుకూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి శిబిరం ప్రారంభం చేస్తామని, కంటి పరీక్షలతో పాటు ఉచితంగా శస్త్ర చికిత్సలు దఫాల వారీగా చేయిస్తామన్నారు. ఈఅవకాశాన్ని నిరుపేదలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి 992 గ్రూపులు

శావల్యాపురం: వైఎస్సార్ సున్నా వడ్డీ నాల్గవ విడతలో మండలంలోని 992 స్వయం సహాయక మహిళా సభ్యురాలకు రూ. ఒక కోటి 44 లక్షల 37 వేలు అర్హత పొందినట్లు ఏపీయం జి.వాసుబాబు మంగళవారం తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలు సకాలంలో చెల్లింపులు చేసిన గ్రూపుల్లోని మహిళా సభ్యులకు లబ్ధిపొందినట్లు చెప్పారు. అర్హత పొందిన గ్రూపుల సమగ్ర వివరాలు ఆయా గ్రామ సచివాలయ పరిధిలో సీసీలు, గ్రామసంఘం అసిస్టెంట్స్ ద్వారా జాబితాను డిస్ప్లే చేశామన్నారు. జగనన్న తోడు పథకంలో 281 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేయగా ఇందుకుగాను సకాలంలో రుణాలు చెల్లించిన లబ్ధిదారులకు రూ. 45 వేల 279 రూపాయలు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. జగనన్న తోడు చిరు వ్యాపారులకు 6వ విడతలో భాగంగా శావల్యాపురంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 148 మంది లబ్ధిదారులు, ఎస్‌బీఐ కారుమంచిలో 42 మంది, వేల్పూరు ఎస్‌బీఐ బ్యాంకు శాఖలో 55 మంది లబ్ధిదారులు అర్హత పొందినట్లు చెప్పారు. ఆయనతో పాటు సీసీలు ఖాజావలీ, గొట్టం రమాదేవి, బేబిరాణి పాల్గొన్నారు.

సాగర్ జలాలతో మంచి నీటి చెరువులు నింపాలి

శావల్యాపురం: సాగర్ జలాలతో మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో మంచినీటి చెరువులు, కుంటలు, వాగులు నింపాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ సాగర్ జలాలు తాగు నీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు సాగర్ జలాలు విడుదల అవడంతో మండల కేంద్రం శావల్యాపురంలో మంచి నీటి చెరువులోని తాగునీరు అయిల్ ఇంజిన్లు ద్వారాబయటకు పంపుతున్నామన్నారు. గ్రామంలోకి తాగునీరు వారం రోజుల వరకు సరఫరా నిలుపుదల చేస్తామని, తదుపరి చెరువులో పేరుకుపోయిన మట్టిపూడికను తీసేసి, చెరువును బ్లీచింగ్‌తో శుద్ధిచేసి సాగర్ జలాలను నింపుతామన్నారు.అలాగే పంచాయతీ నిధులు రూ. లక్ష రూపాయల వ్యయంతో రెండు విద్యుత్ మోటార్లు నూతనంగా ఏర్పాటు చేసి చిన్నపాటి మరమ్మతులను పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. అనంతరం శావల్యాపురం గ్రామంలోకి తాగునీరు విడుదల చేస్తామన్నారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్, పంచాయతీ కార్యదర్శి కనుగంటి మహేంద్ర ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వీరనరేష్ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వల్ప వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి మందులు అందజేశారు. రక్తహీనత నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డెన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలతో అన్ని వర్గాలు సంతోషం

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలు ఉన్నారు
- గడప గడపకు విశేష స్పందన
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



నాదెండ్లలో పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: అభివృద్ధి, సంక్షేమంతో అన్ని వర్గాల ప్రజల్లో అంతులేని సంతోషం వ్యక్తమౌతోందని, సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే తాముంటామని ప్రజలు చెబుతుండటం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు గీటురాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఐదో రోజు నిర్వహించారు. 6,7,8 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అమలౌతున్న తీరును ప్రజలతో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహన మిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజేంద్రప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీ చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి, ఎంపీటీసీలు యల్లారావు, కుంభా అంకమ్మ, దావల ఏసమ్మ, కె.రామకృష్ణయ్య, మలిపెద్ది శివ కామేశ్వరరావు, పర్చూరి కృష్ణారావు, నెల్లూరి పట్టాభి, క్రేన్ హరిబాబు, నల్లమోతు రామారావు, మామిడి వెంకటేశ్వర్లు, దావులూరి నరసమ్మ, పరమేశ్వరరావు, కొరివి లక్ష్మయ్య, కాంద్రు శేషయ్య, చెంచురాజు, ఆలా శివగోపీ, కోనేటి నాగయ్య, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, సింగారెడ్డి కోటిరెడ్డి, కట్టెబోయిన వీరాస్వామి, పఠాన్ సుభాని, రత్తయ్య, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, బత్తుల సీతారామిరెడ్డి, స్లీవారెడ్డి, మాలె వెంకటస్వామి, చేరెడ్డి వెంకటరెడ్డి, మిరియాల కోటయ్య, గోరంట్ల అంకమ్మ, వలేటి శ్రీదేవి, గంగినీడీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



కోర్టు ప్రాంగణం ముందు స్టేషన్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్ష, ప్రజాసంఘాల నాయకులు

అల్లర్లు, హింసపై న్యాయవాదుల నిరసన

నరసరావుపేట: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, జాతి వైషమ్యలను పెంచి పోషిస్తున్న బీజేపీ మతోన్మాద చర్యలను ఖండిస్తూ బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు ప్రాంగణం ఎదుట స్టేషన్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు మేదరమెట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని, అక్కడ మానవ హక్కులను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు అమూల్య మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం మహిళలకు జీవించే హక్కు ఉందని, ఈ హక్కును ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకొని మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హరీష్ మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద చర్యల వల్ల మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు దాడులు జరుగుతున్నాయని, సహజ వనరులను బడా కంపెనీలకు అప్పజెప్పే క్రమంలోనే ఈ జాతి వైషమ్యాలు ఆర్‌ఎస్‌ఎస్ లాంటి మతోన్మాద శక్తులు రెచ్చగొడుతున్నారన్నారు. ఐలూ పల్నాడు జిల్లా నాయకులు ముక్కడాల సుబ్బారావు మాట్లాడుతూ ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలను ఖండిస్తూ వెంటనే రాష్ట్రపతి పాలన విధించి మానవ హక్కులను కాపాడాలని కోరారు. జిల్లా నాయకులు కె. సునీల్‌సింగ్ మాట్లాడుతూ మణిపూర్‌లో వెంటనే శాంతి భద్రతలు చేపట్టి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. మహిళా న్యాయవాది నసీమా రాజశేఖర్ మాట్లాడుతూ మణిపూర్‌లో ప్రజాస్వామ్య హక్కు లు కాలరాయబడుతున్నాయని, స్త్రీల జాతిని అవమానిస్తూ వారి హక్కులకు భంగం వాటిల్లిందన్నా రు. స్త్రీలపై అమానుషంగా ప్రవర్తించిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు సీజే ప్రతాప్, చార్లెస్, కొండా సాంబశివరావు, ఎం.ఆరోగ్యం చౌదరి, కె.విజయ్‌కుమార్, బి.సలీం, చంద్రశేఖర్, మహమద్ షరీఫ్, మహిళా న్యాయవాదులు రమాదేవి, క్రోసూరి రాధిక పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన ప్రజాస్వామ్యానికే తీరని మచ్చ

చిలకలూరిపేటటౌన్: మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై అత్యాచారం, మారణహోమం అరికట్టడంలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ చరిత్ర మణిపూర్ సంఘటన ప్రజాస్వామ్యానికి తీరని మచ్చని, 9 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వంలో దేశంలో మహిళలకు రక్షణకరువుందన్నారు. ఇంతటి తీవ్ర సంఘటన జరిగి రెండు నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అమానుషమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీల నాయకులు నాగబైరు రామ సుబ్బాయమ్మ, ఎం.రాధాకృష్ణ, పేరుబోయిన వెంకటేశ్వర్లు, మాదాసు భానుప్రసాద్, చెరుకుపల్లి నిర్మల, విన్సెంట్‌పాల్, దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో ఎమ్మెల్యే పర్యటన



కల్వర్ట్, డ్రెయినేజ్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్నపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. రొంపిచర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిర్మిస్తున్న డ్రెయినేజీ, కల్వర్ట్‌లను ఆయన పరిశీలించారు. అలాగే డ్రెయినేజ్, కల్వర్ట్‌ల నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోతులూరి శ్రీనివాసరెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, వద్దుల సుబ్బారెడ్డి, పడాల చక్రారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు, సంజీవరెడ్డి, కల్లి వెంకటరెడ్డి, గొట్టం వీరారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, బీరం భాస్కర్ రెడ్డి, ఎస్సీసెల్ నాయకుడు గుండాల వెంకటేష్, పమ్మి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

యడ్లపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలం వంకాయలపాడులో బుధవారం గ్రామంలోని సచివాలయం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. ఈ సదస్సులో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని 11 రకాల ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి



వినుకొండ(నూజెండ్ల): మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సూచనలు, సలహాల మేరకు పట్టణంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు పట్టణంలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో అభివృద్ధి అజెండాలో పొందుపరిచిన 35 అంశాలపై చర్చించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి వాటిని ఆమోదించారు. 30వ వార్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ ఎంఎల్ రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. 19వ వార్డులో వీధి లైటు లేవని కౌన్సిలర్ బాషా కోరగా మరికొందరు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశం దృష్టికి తీసుకురాగా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చైర్మన్ తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుడ్ విల్ పద్ధతిపై నిర్మాణం చేపట్టబోయే కమర్షియల్ కాంప్లెక్స్‌ను జీవో నెంబరు 146 ప్రకారం అమలు పరచాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చిన టీడీపీ కౌన్సిలర్లు చైర్మన్‌కు వినతిపత్రం అందించి సమావేశం నుంచి వాకౌట్ అయ్యారు.

రోగులకు పౌష్టికాహారం అందజేత



పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న డీఎండీహెచ్‌వో శోభారాణి, కేపీ రంగారావు, ప్రతినిధులు

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో వైద్యానికి వచ్చిన బాలింతలు, ఇతర ఆరోగ్య సమస్యలతో వైద్యం కోసం వచ్చిన పేషంట్లకు పౌష్టికాహారం, పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం తాళ్ల సుదర్శన్‌రెడ్డి సహకారంతో నరసరావుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వైద్యశాలలో పౌష్టికాహారం, పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ కేపీ రంగా రావు, డీఎండీహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వంతో పాటు, సేవా సంస్థలు, దాతలు కూడా ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం మంచి పరిణామమంటూ వారిని అభినందించారు. కేపీ రంగారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించటమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. జిల్లా ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ ఎం.మంత్రూనాయక్, రోటరీ క్లబ్ అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాసరావు, సెక్రెటరీ రాజేష్, రోటరీ క్లబ్ డైరెక్టర్లు షేక్ జిలానిమాలిక్, మేళ్ళచెరువు సుమిత్రకుమార్, పాశం కృష్ణారావు, కాకుమాను శ్రీనివాసరావు, కాకుమాను రాఘవరావు, జమ్ముల రాధాకృష్ణ, పొట్టి శశిభూషణ్, భవనం దుర్గ మునిందర్‌రెడ్డి, మురారిశెట్టి వెంకటేశ్వర రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, వైద్యశాల డాక్టర్లు హనుమ కుమార్, డాక్టర్ నాగ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన తమ్మిశెట్టి పెద్దిరాజు

రొంపిచర్ల : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన హైవే రోడ్డు పరిధిలో గల మండలంలో సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి పెద్దిరాజు(19) మండలంలోని విప్పర్ల గ్రామం నుండి సంతగుడిపాడు గ్రామానికి బైక్ మీద వస్తున్నారు. ఇదే క్రమంలో సంతగుడిపాడు గ్రామంలో గల పరగటిచర్ల అడ్డరోడ్డు వద్దకు రాగా వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో బైక్ మీద నుండి కిందపడి తీవ్ర గాయాలు పాలైన పెద్దిరాజు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన జరిగిన వెంటనే గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సంఘటన జరిగిన తీరును అక్కడ ఉన్నవారిని అడిగి తెలుసుకున్నారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ సురేష్ బాబు తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



మృతుడు పరిశుద్ధరావు

నాదెండ్ల: జాతీయ రహదారిపై అడ్డు వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై జె.బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన నేలటూరి పరిశుద్ధరావు (25) ముఠా పనులు చేసుకుని జీవిస్తుంటాడు. ఈ నెల 23న తన మిత్రుడు రమేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై యద్దనపూడిలోని తన సోదరి నివాసానికి వెళ్ళాడు. తిరిగి రాత్రి 10.30 గంటల సమయంలో తుమ్మలపాలెం వెళ్తుండగా ఏఎంజీ చెక్‌పోస్టు వద్దకు వచ్చేసరికి వాహనానికి కుక్క అడ్డుగా రావటంతో తప్పించే క్రమంలో అదుపుతప్పి పడ్డారు.

దీంతో తీవ్ర గాయాలైన పరిశుద్ధరావు, రమేష్‌లను 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పరిశుద్ధరావును గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యం పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పరిశుద్ధరావు సోదరి మాదాసు ప్రవల్లిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సులభతరంగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు

సురక్షలో నెలరోజుల పాటు ఉచిత సేవలు



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు



వినుకొండలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, నాయుడుపాలెం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో తహసీల్దార్ ఏవీ సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా బృందాలు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాల అమలు పూర్తిగా పారదర్శకంగా జరిగిందన్నారు. సంక్షేమంతో పాటు లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలకు జగనన్న సురక్ష నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయటమైందని తెలిపారు. ఈ పథకంలో కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల, ఇమ్యూటేషన్, ఆధార్, కౌలు కార్డులు తదితర 11 రకాల సేవలు అర్హత గల లబ్ధిదారులకు ఉచితంగా అందజేశామని చెప్పారు. ఎటువంటి రుసుము లేకుండా, సులభతరంగా వలంటీర్లు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి దరఖాస్తులు నమోదు చేసుకొని సచివాలయాల్లో ఉచితంగా పంపిణీ జరిగిందన్నారు. రైతులకు రీసర్వే ద్వారా మేలు జరుగుతుందని, భూముల రీ సర్వే అనంతరం గ్రామ కంఠంలో ఇళ్ల స్థలాల కొలతల నమోదు వంటి రీ సర్వే కార్యక్రమం చేపడతామని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతవాసులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.చిన్నవెంకయ్య, సర్పంచ్‌లు టి.వెంకట రమణ, బి.రాంబాబు నాయక్, ఎం.చిన్నవీరయ్య, పి.సాయిబాబు, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ డి.గోవిందునాయక్, బీసీ కార్పొరేషన్ డెరెక్టర్ బి. గురవయ్య, అవినాష్‌రెడ్డి, సాంబిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పలుశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డీఎల్‌డీవో యం.వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు గ్రామసచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ అర్హత కలిగి ఉన్న ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్యమంలా జరుగుతోందన్నారు. అనంతరం 340 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దావులూరి సంపూర్ణ, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, వీఆర్వో రాంబాబు, కార్యదర్శి డి.రవీంద్రబాబు, వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: అర్హత ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు లభించని వారికి లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని 20,21, 23,36,37 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు ఏ ప్రభుత్వం కూడా చేపట్టని గొప్ప కార్యక్రమం ఇదని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాల పరంగా ఇంకా ఎవరైనా అందని వారుంటే వారికి సంబంధిత ధృవీకరణ పత్రాలు అందించి అర్హులను చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం, భూహక్కు పత్రాలు, పంట సాగు కార్డులు, కొత్త రేషన్‌కార్డు, లేదా రేషన్‌కార్డు విభజన, కుటుంబ వివరాల్లో మార్పులు ఇలా 11 రకాల ధ్రువపత్రాలను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా అందించే మహత్తర కార్యక్రమం అని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం పారదర్శకంగా అమలు చేసిన ఘనత ప్రజలందరికీ తెలుసన్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు అందేలా చూడడం, సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి వారికి త్వరితగతిన పథకాలు అందేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు.

ఐదేళ్లుగా అందని రేషన్ కార్డు



ఈమె పేరు మిరియంపల్లి ధనలక్ష్మి, నాయుడుపాలెం సచివాలయం. అత్తమామల నుంచి విడిపడి ఐదేళ్ల అయింది. అప్పటి నుంచి రేషన్ కార్డు లేదు. ఇరువురు సంతానం. రేషన్ కార్డు లేకపోవడంతో జగనన్న సురక్షలో వలంటీర్‌కు దరఖాస్తు అందజేశాం. సురక్ష ద్వారా కుటుంబం రైస్ కార్డు లభించింది. దీంతో రేషన్ పొందే అవకాశం వచ్చింది.

28న ముస్లింల ర్యాలీ

నరసరావుపేట: మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగా ఈనెల 28వ తేదీ శుక్రవారం పట్టణంలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రజా, కల సంఘాలు, వామపక్ష నాయకులు ప్రకటించారు. మంగళవారం స్థానిక షాదీ ఖానా మైదానంలో మణిపూర్ బాధితులకు సంఘీభావంగా పట్టణంలోని ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో ఆదివాసీలు, మహిళలు, గిరిజనులు, క్రిస్టియన్‌లపై జరుగుతున్న హింసాత్మక దాడులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. 28వ తేదీన జుమ్మా నవాజ్ అనంతరం మణిపూర్ బాధితులకు మేము సైతం అండగా అంటూ ముస్లింల నిరసన ర్యాలీ చేపట్టడం జరుగుతుందని మత పెద్దలు తెలిపారు.సమావేశంలో కుల,ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు డి.శివకుమారి, షేక్ మస్తాన్, మౌలాలి, బాసిద్, మస్తాన్‌వలి, కృష్ణ, రామకృష్ణ, కొండలు, కాలేషావలి, దరియావలి, ఖలీల్, బాజీ కరీం సుభాని, కరీముల్లా, సిలార్, జాన్‌పాల్, బాదుగున్నల శ్రీనివాసరావు, రమాదేవి పాల్గొన్నారు.

నేడు చందవరంలో జగనన్న సురక్ష

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ అల్లడి రవికుమార్ తెలిపారు. గ్రామ సచివాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు వివిధ రకాల ధృవ పత్రాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, అధికారులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ప్రారంభమైన పాఠశాల సముదాయాల శిక్షణ

యడ్లపాడు: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ (పాఠశాల సముదాయాలు) శిక్షణ తరగతులు మంగళవారం మొదలయ్యాయి. మండలంలోని ఉన్నవ, జగ్గాపురం, సందెపూడి, వంకాయలపాడు, సందెపూడి, సొలస జెడ్పీ హైస్కూళ్లలో నిర్వహించారు. పాఠశాల నిర్వహణలో ఎదురయ్యే విద్యా విషయక, ఇతర సమస్యలకు పరిష్కార వేదికగా చేసుకుని డీఆర్‌పీలు ఆయా అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

పాఠశాలకు పుస్తకాలు వితరణ



హెచ్‌ఎంకు పుస్తకాలు అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ కుటుంబ సభ్యులు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఆ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ గానుగపంట వెంకటేశ్వరరెడ్డి రూ.50 వేల రూపాయల విలువచేసే ఇంగ్లీష్ స్టోరీ బుక్స్ ఫర్ లైబ్రరీ పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఈ పుస్తకాలను వెంకటేశ్వరరెడ్డి అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కోర్సులకు అనుగుణంగా స్పోకెన్ ఇంగ్లిషులో విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆయా తరగతులకు అనుగుణంగా పుస్తకాలను గ్రేడింగ్ చేసి ట్రంక్ పెట్టెల్లో భద్రపరిచి అందించారు.

గతంలో కూడా ఈ దంపతులు పాఠశాలకు రూ.40 వేల రూపాయల విలువచేసే లైబ్రరీ బుక్స్‌ను అందజేశారు. మరోసారి స్టోరీ బుక్స్‌ను అందించి విద్యపట్ల, ప్రభుత్వ పాఠశాల పట్ల వారికున్న మక్కువను తెలియజేసుకున్నారు. వెంకటేశ్వరరెడ్డి పాఠశాల విద్యను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.